తెలంగాణ
TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

వరంగల్ | గురువారం - 16 - ఏప్రిల్ - 2026 | సంపుటి : 3 | సంచిక : 318 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## మహిళా రిజర్వేషన్‌కు మద్దతు.. పునర్విభజనపై ససేమిరా: కేసీఆర్ స్పష్టీకరణ

ఎర్రవెల్లి నివాసంలో కేటీఆర్, హరీశ్ రావులతో కేసీఆర్ కీలక భేటీ

దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదు

ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ వేడుకల నిర్వహణపై దిశానిర్దేశం

2లో





## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

# హెల్మెట్ తప్పనిసరి

యువత ప్రాణాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది

ఆదిలాబాద్‌లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ప్రారంభం

విపత్తుల కంటే ప్రమాదాల్లోనే ఎక్కువ మరణాలు

**ఆదిలాబాద్, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో భారీగా ప్రాణనష్టం సంభవిస్తుండటంపై ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా కుటుంబాలకు వెన్నెముకగా ఉండాల్సిన యువకులు ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ఉద్ఘాటించారు. సాధారణంగా ఏదైనా ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు ఎంతమంది ప్రాణాలు కోల్పోతారో, అంతకంటే ఎక్కువ మంది రోడ్డు ప్రమాదాల వల్ల మరణిస్తున్నారని మంత్రి గణాంకాలతో వివరించారు. ఈ మరణాల వల్ల ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని, పిల్లలు అనాథలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు కలిగే ప్రాణనష్టం కేవలం ఒక వ్యక్తికే పరిమితం కాదని, అది మొత్తం కుటుంబంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన గుర్తు చేశారు.

మిగతా 2లో..



## చారిత్రక సంపదకు పూర్వవైభవం

పర్యాటక రంగ అభివృద్ధిపై మంత్రి జూపల్లి సమీక్ష

కుతుబ్ షాహీ టూంబ్స్ నుండి గోల్కొండ వరకు రోప్‌వే ప్రాజెక్ట్

కటోరా హౌస్ పునరుద్ధరణ.. వారంలోగా పెండింగ్ పనులు ప్రారంభం

గోల్కొండ సమీపంలో లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్

2లో



## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

మంత్రి శ్రీధర్ బాబు

480 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాల పంపిణీ

కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన మంత్రి

అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీ

2లో



## విద్యుత్ ఆర్టిజన్ కార్మికులకు బీజేపీ మద్దతు

నిరసన శిబిరాన్ని సందర్శించిన రామ్‌చందర్ రావు

డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి

కార్మికుల హక్కుల కోసం పోరాటానికి హామీ

2లో

# పరిగి ఇండస్ట్రియల్ కారిడార్‌పై రైతుల ఆందోళన

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మద్దతు
- బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ధర్నా
- కవిత, విశారదన్‌పై పోలీసులతో వాగ్వాదం
- రైతుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామన్న హెచ్చరిక

**వికారాబాద్, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** వికారాబాద్ జిల్లా పరిగి ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రైతుల భూములను నిర్బంధంగా స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపిస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట నడి ఎండలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనకు జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ హాజరై మద్దతు తెలిపారు. పోలీసులు ఆందోళనను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో కవిత, విశారదన్‌లతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ పరిశ్రమల పేరుతో చిన్న, సన్నకారు రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని తీవ్రంగా మండిపడ్డారు. కల్లాపూర్, రాపోల్, భట్లచందారం వంటి గ్రామాల్లో రైతుల భూములను పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపించారు. సుమారు 1200 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంటున్నారని, అందులో ఎక్కువ భాగం అసైన్డ్ భూములేనని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల భూములు కూడా ఇందులో ఉండటం దురదృష్టకరమని పేర్కొన్నారు. రైతులకు మరో మార్గం లేకుండా పరిస్థితి తీసుకువస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా రైతులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని కవిత అన్నారు. మద్దతు ధర, రుణమాఫీ, ఎరువుల కొరత వంటి సమస్యలు పరిష్కారం కాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. బలవంతపు భూసేకరణను నిలిపివేసే వరకు పోరాటం కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు. రైతుల హక్కుల కోసం జాగృతి, ధర్మ సమాజ్ పార్టీ ఎప్పటికప్పుడు అండగా ఉంటాయని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమమే మార్గమని పిలుపునిచ్చారు.



## హైదరాబాద్ పరిస్థితులపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

- దోమలు, దొంగలపై ఘాటు వ్యాఖ్యలు
- భూకబ్జాలు, అభివృద్ధిపై ఆరోపణలు
- ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్‌కు మద్దతు కోరింపు

2లో

## రేవంత్ రెడ్డి తీరుపై జీవన్ రెడ్డి ధ్వజం

- 'కాంగ్రెస్ ఇప్పుడు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ'
- ఎమ్మెల్యేలకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపణ
- కేసీఆర్ వ్యక్తిత్వంపై ప్రశంసలు కురిపించిన మాజీ మంత్రి
- పార్టీ సూచనలు కాకుండా ప్రభుత్వం చెప్పినట్లే పార్టీ నడుస్తోందని విమర్శ

2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

**మంథని, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ అభివృద్ధి ఫలాలను అందించడమే కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. బుధవారం మంథని నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు ప్రభుత్వ సాయాన్ని అందజేస్తూ, నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా మంథని మున్సిపాలిటీతో పాటు మంథని, ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి మండలాలకు చెందిన 480 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాలను మంత్రి శ్రీధర్ బాబు అందజేశారు. ఏళ్ల తరబడి సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఈ పథకం ఒక వరమని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గవ్యాప్తంగా దశలవారీగా అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

సంక్షేమ పథకాల అమలులో భాగంగా 129 మంది ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 169 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ. 1.84 కోట్ల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. పేదల కష్టకాలంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, వైద్యం కోసం ఎవరూ అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశంతో సీఎంఆర్ఎఫ్ నిధులను త్వరితగతిన మంజూరు చేస్తున్నామని మంత్రి వివరించారు. విద్య వైద్య రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని 160 మంది అంగన్‌వాడీ టీచర్లకు మంత్రి శ్రీధర్ బాబు స్మార్ట్ మొబైల్ ఫోన్లను అందజేశారు. ఇకపై అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ, సమాచార సేకరణ మరియు రిపోర్టింగ్ ప్రక్రియ డిజిటల్ విధానంలో సులభతరం అవుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారులకు నాణ్యమైన సేవలు అందించాలని టీచర్లకు సూచించారు. మంథని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని మంత్రి స్పష్టం చేశారు. అర్హత ఉండి పథకాలు అందని వారుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. మంత్రి పర్యటనతో మంథని నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది.

# విద్యుత్ ఆర్టిజన్ కార్మికులకు బీజేపీ మద్దతు

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ విద్యుత్ సంస్థల్లో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత కొన్ని రోజులుగా పోరాడుతున్న విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల నిరసన శిబిరాన్ని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రమజీవుల కష్టాలను గుర్తించి తగిన న్యాయం చేయాలని సూచించారు. కార్మికుల డిమాండ్లు న్యాయమైనవేనని పేర్కొంటూ వారికి సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. కార్మికుల హక్కుల సాధన కోసం బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యమం మరింత ఉద్ధృతం అయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు. కార్మికుల శ్రమతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు. వారి సంక్షేమం కోసం తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. శ్రమజీవుల పక్షాన బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని రామ్‌చందర్ రావు స్పష్టం చేశారు. కార్మికులతో కలిసి వారి హక్కుల సాధన వరకు పోరాడతామని తెలిపారు.

## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

# హెల్మెట్ తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

అందుకే ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ఆయన కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణా శాఖ మరియు పోలీస్ శాఖ సంయుక్తంగా 'అరైవ్ అలైవ్' వంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని మంత్రి తెలిపారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, వేగ పరిమితిని మించకూడదని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన పిలుపునిచ్చారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాపాయం నుండి 80 శాతం వరకు తప్పించుకునే అవకాశం ఉంటుందని, దీనిని ఒక భారంగా భావించకుండా బాధ్యతగా గుర్తించాలని ఆయన స్పష్టం చేశారు. యువత బైక్ రేసింగ్‌లు మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు వారికి భద్రత పట్ల అవగాహన కల్పించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అనేది జరిమానాల నుంచి తప్పించుకోవడానికి మాత్రమే కాదని, మన ప్రాణాలను మనం కాపాడుకోవడానికేనని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా, ప్రజల భాగస్వామ్యం మరియు స్వీయ నియంత్రణ లేనిదే ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించడం సాధ్యం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు మరియు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. రోడ్డు భద్రతపై ప్రభుత్వం చేపడుతున్న ఈ ప్రచారం నిరంతరం కొనసాగుతుందని, జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని అధికారులు వెల్లడించారు. 'అరైవ్ అలైవ్' లక్ష్యం నెరవేరాలంటే ప్రతి పౌరుడు ట్రాఫిక్ నియమాలను గౌరవించాలని మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

# హైదరాబాద్ పరిస్థితులపై కేటీఆర్ తీవ్ర విమర్శలు



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లో ప్రస్తుత పరిస్థితులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. నగరంలో ప్రస్తుతం సంతోషంగా ఉన్నవారు ఇద్దరే ఉన్నారని, ఒకరు దొంగలు, మరొకరు దోమలని ఘాటుగా వ్యాఖ్యానించారు. నగరంలో ఎక్కడపడితే అక్కడ భూములు కబ్జాలు జరుగుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. ఒకవైపు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మరోవైపు ముఖ్యమంత్రి పాలనలో ఈ పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. నగరంలో దోమల సమస్య కూడా అధికంగా ఉందని పేర్కొన్నారు. దోమల సమస్యపై అసెంబ్లీలో కూడా ప్రస్తావించానని, నగరానికి 'దోమలబాదు' లేదా 'దోమలగూడ' అనే పేర్లు పెట్టాలని చెప్పినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్పై అపవాదులు మోపి తప్పించుకోవాలని ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ అన్నారు. కానీ ప్రజలు నిజాన్ని తెలుసుకుంటారని, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉప్పల్ ఫ్లైఓవర్ పనులపై కూడా కేటీఆర్ విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్ట్ ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్నప్పటికీ పురోగతి లేదని తెలిపారు. తాము నిర్మించేందుకు సిద్ధమని చెప్పినా ప్రభుత్వం అంగీకరించలేదని ఆరోపించారు. ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని ప్రజలను కేటీఆర్ కోరారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే మళ్లీ బుల్డోజర్ రాజకీయాలు వస్తాయని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి తమకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# రేవంత్ రెడ్డి తీరుపై జీవన్ రెడ్డి ధ్వజం

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరుపై ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ పార్టీపై హైకమాండ్ పట్టు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డికి సంబంధించిన 'ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ'గా మారిపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న ఏకపక్ష ధోరణి వల్ల పార్టీ మనుగడకే ప్రమాదం ఏర్పడిందని ఆయన హెచ్చరించారు.

పార్టీలో ప్రజాస్వామ్యం కరువైందని, కనీసం ఎమ్మెల్యేలకు కూడా ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ లభించడం లేదని జీవన్ రెడ్డి ఆరోపించారు. సాధారణంగా పార్టీ తీసుకునే విధానపరమైన నిర్ణయాల మేరకు ప్రభుత్వం నడుస్తుందని, కానీ ఇప్పుడు పరిస్థితి తలకిందులైందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం చెప్పినట్లుగా పార్టీ నడుస్తోందని, రేవంత్ రెడ్డి నిర్ణయాల వల్ల కాంగ్రెస్ పార్టీ అస్తిత్వం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులను గౌరవించడం లేదని, పార్టీని రేవంత్ రెడ్డి క్రమంగా ఖతం చేస్తున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి జీవన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ తన వయసును గౌరవించి ఎప్పుడూ 'అన్న' అని పిలుస్తారని గుర్తు చేసుకున్నారు. కేసీఆర్‌కు ప్రజలంటే అపారమైన గౌరవం ఉందని, ఆయన వ్యక్తిత్వం రేవంత్ రెడ్డి లాంటిది కాదని ప్రశంసించారు. కేసీఆర్ హయాంలో కనీసం సంప్రదింపులకు అవకాశం ఉండేదని, ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయాలకు అతీతంగా కేసీఆర్ ఇచ్చే గౌరవం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. తాను బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలపై కూడా జీవన్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. తాను ఏ పార్టీలో ఉన్నా ఆఖరి వరకు ప్రజల కోసమే పోరాడతానని స్పష్టం చేశారు. పార్టీ మారుతున్నారా లేదా అనే విషయంపై సూటిగా సమాధానం చెప్పకపోయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల పట్ల తాను తీవ్ర అసంతృప్తితో ఉన్నానని ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రథమ ప్రాధాన్యతని, పదవుల కోసం పాకులాడబోనని ఆయన వెల్లడించారు. జీవన్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో పెద్ద దుమారాన్ని రేపుతున్నాయి. ముఖ్యంగా సొంత పార్టీ ముఖ్యమంత్రిపైనే సీనియర్ నాయకుడు బహిరంగంగా విమర్శలు చేయడం కాంగ్రెస్ శ్రేణులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రానున్న రోజుల్లో పార్టీ అధిష్టానం ఈ విషయంలో జోక్యం చేసుకుంటుందా లేదా అనేది వేచి చూడాలి. జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి వర్గం ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## మహిళా రిజర్వేషన్‌కు మద్దతు..

# పునర్విభజనపై ససేమిరా: కేసీఆర్ స్పష్టీకరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):**భారత ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ మరియు నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తన వైఖరిని స్పష్టం చేశారు. బుధవారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులతో ఆయన సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశ, రాష్ట్ర రాజకీయ పరిణామాలతో పాటు పార్లమెంటులో ప్రవేశపెట్టబోయే బిల్లులపై క్షుణ్ణంగా చర్చించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలుపుతూనే, నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనేది బీఆర్ఎస్ పార్టీ సుదీర్ఘ కాలపు డిమాండ్ అని కేసీఆర్ గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే అసెంబ్లీలో దీనిపై ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపామని ఆయన వివరించారు. ఈ బిల్లుకు తమ పార్టీ ఎంపీలు బేషరతుగా మద్దతు తెలుపుతారని ప్రకటించారు. మహిళా సాధికారత దిశగా ఇది ఒక గొప్ప అడుగు అని అభివర్ణించిన ఆయన, సామాజిక న్యాయం పాటించే ఏ బిల్లుకైనా బీఆర్ఎస్ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

అయితే, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన సీట్ల కేటాయింపు జరిగితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం లోక్ సభలో దక్షిణాది రాష్ట్రాలకు ఉన్న 24 శాతం ప్రాతినిధ్యం ఏమాత్రం తగ్గకూడదని డిమాండ్ చేశారు. అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ వంటి రాష్ట్రాలకు సీట్లు పెరగాల్సిన చోట, జనాభా లెక్కల పేరుతో అన్యాయం చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు.

బిల్లులోని ప్రతి క్లాజును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నియోజకవర్గాల పునర్విభజనపై పార్టీ తుది నిర్ణయం తీసుకుంటుందని కేసీఆర్ నేతలకు సూచించారు. అప్పటి వరకు తొందరపాటు వ్యాఖ్యలు చేయవద్దని కోరారు. దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు, నాయకులతో ఈ విషయంలో సమన్వయం చేసుకుని ఉమ్మడి పోరాటం చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఉత్తరాది రాష్ట్రాలకు లాభం చేకూర్చేలా, దక్షిణాదిని వెనుకబాటుకు గురిచేసేలా ఏ నిర్ణయం ఉన్నా పార్లమెంటులో అడ్డుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

పార్టీ భవిష్యత్ కార్యక్రమాలపై కూడా కేసీఆర్ ఈ భేటీలో దిశానిర్దేశం చేశారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కేటీఆర్, హరీశ్ రావులను కోరారు. అలాగే ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మండుతున్న ఎండల దృష్ట్యా సభలకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, గ్రామ స్థాయి నుండి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఈ భేటీతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# చారిత్రక సంపదకు పూర్వవైభవం

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలోని చారిత్రక కట్టడాలు వారసత్వ సంపదను ప్రపంచ పర్యాటక మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టడమే లక్ష్యమని రాష్ట్ర పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. బుధవారం ఉదయం ఆయన ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌తో కలిసి సెవెన్ టూంబ్స్ (కుతుబ్ షాహీ సమాధులు), కటోరా హౌస్ మరియు కేబీ మ్యూజియం ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి, పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. కుతుబ్ షాహీ టూంబ్స్ ఆవరణలో జరుగుతున్న పరిరక్షణ పనులపై మంత్రి అసహనం వ్యక్తం చేస్తూ, పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పట్టాలెక్కించాలని సూచించారు. వారంలోగా మిగిలిన అన్ని పనులను ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్ట్ ఏజెన్సీలను ఆదేశించారు. పర్యాటకుల సౌకర్యార్థం కుతుబ్ షాహీ టూంబ్స్ నుండి గోల్కొండ కోట వరకు ప్రతిపాదించిన రోప్‌వే ప్రాజెక్ట్ పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి, వెంటనే డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు.450 ఏళ్ల చరిత్ర కలిగిన కటోరా హౌస్ జలవనరు ప్రస్తుతం చెత్తాచెదారంతో నిండి ఉండటంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు హైడ్రా జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరిసరాల్లోని వ్యర్థాలను వెంటనే తొలగించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గోల్కొండ సందర్శనకు వచ్చే పర్యాటకుల కోసం పాతబస్తీలోని లాడ్ బజార్ తరహాలో ఒక అత్యాధునిక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఇది స్థానిక కళాకారులకు మరియు వ్యాపారులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కేబీ మ్యూజియం అభివృద్ధిపై కూడా మంత్రి ప్రత్యేక దృష్టిసారించారు. మ్యూజియం ఆవరణలో ఖాదీ ఉత్పత్తుల ప్రదర్శనను ఏర్పాటు చేయాలని, తద్వారా పర్యాటకులకు మన సంస్కృతిని పరిచయం చేయవచ్చని తెలిపారు. మ్యూజియం భూముల ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించాలని, పోలీస్ శాఖ సహకారంతో ఆక్రమణలను తొలగించి పర్యాటక పరంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. చారిత్రక కట్టడాల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని, అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర పర్యాటక రంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు, భవిష్యత్ తరాలకు మన చరిత్రను అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. గోల్కొండ మరియు పరిసర ప్రాంతాలను ఒక ఇంటిగ్రేటెడ్ టూరిజం సర్క్యూట్‌గా మారుస్తామని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో పర్యాటక శాఖ ఉన్నతాధికారులు, పురావస్తు శాఖ ప్రతినిధులు మరియు స్థానిక నేతలు పాల్గొన్నారు. మంత్రి ఆదేశాలతో రానున్న రోజుల్లో గోల్కొండ పరిసర ప్రాంతాలు సరికొత్త రూపురేఖలను సంతరించుకోనున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
గురువారం - 16- ఏప్రిల్ 2026




# "తులసి తీర్థం" నాటికతో కుల నిర్మూలన సందేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి 8 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కుల నిర్మూలన సాంస్కృతికోత్సవాల్లో భాగంగా "తులసి తీర్థం" నాటికను ప్రదర్శించారు.ఈ నాటికలో బొమ్మగాని సోమయ్య మహిళా పాత్రలో, బొమ్మగాని రుక్కయ్య పనివాడి పాత్రలో, పాండు పంతులు పాత్రలో అద్భుతంగా నటించి ప్రేక్షకులను అలరించారు. కులం కాదని, మనిషే ముఖ్యం, మానవత్వమే ప్రధానమనే గొప్ప సందేశాన్ని నాటిక ద్వారా స్పష్టంగా తెలియజేశారు. కళాకారుల ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ, కళాకారులు తమ ప్రతిభతో సంస్థకు గౌరవం తీసుకువచ్చారని అభినందించారు.



# మల్కాజిగిరి ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధిపై ఎమ్మెల్యే మర్రి దృష్టి

**మల్కాజిగిరి, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరి ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి, వైద్య సేవల మెరుగుదలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం ఆస్పత్రిని సందర్శించిన ఆయన, అక్కడి పరిస్థితులను పరిశీలించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది లభ్యత, ఔషధాల సరఫరా, మౌలిక వసతుల పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రి అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించి తక్షణమే అమలు చేయాలని అధికారులకు సూచించారు.ప్రత్యేకంగా అవుట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ విభాగాల్లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు పడకలు ఏర్పాటు చేయడం, ఆధునిక పరికరాలు అందుబాటులోకి తేవడం, పరిశుభ్రతను మెరుగుపరచడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని తెలిపారు.మౌలిక వసతుల అభివృద్ధితో పాటు సిబ్బంది బలోపేతం, ఔషధాల సరఫరా వ్యవస్థను సక్రమీకరించడం అత్యవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రజలకు నాణ్యమైన, సమయానికి వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో డీసీహెచ్ఎస్ & మెడికల్ సూపరింటెండెంట్ డా. సునీత, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఉమగౌరి, జీజీహెచ్ కుత్బుల్లాపూర్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రాధ, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండ్‌గా పట్టుబడ్డ మున్సిపల్ ఏఈ

**- హుజురాబాద్‌లో ఏసీబీ దాడి**

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ మున్సిపల్ ఏఈ సుధాకర్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండ్‌గా చిక్కాడు. బిల్లుల క్లియరెన్స్ కోసం ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారు పథకం ప్రకారం దాడులు నిర్వహించారు. లంచం స్వీకరిస్తున్న సమయంలో సుధాకర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.







# అల్టిట్యూడ్ పాఠశాలలో ట్రాఫిక్ రూల్స్ పై చైతన్యం

**ఎల్కతుర్తి, ఏప్రిల్ 15(తెలంగాణ ముచ్చట్లు):** సెయింట్ థామస్ అల్టిట్యూడ్ పాఠశాలలో ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ప్రాముఖ్యత, రోడ్డు రవాణా భద్రతపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై ప్రవీణ్ కుమార్ హాజరై విద్యార్థులకు రోడ్డు భద్రతపై కీలక సూచనలు అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుంది" అని హెచ్చరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు కూడా రోడ్డు భద్రత నియమాల గురించి తెలియజేయాలని, ముఖ్యంగా తల్లిదండ్రులు బయటికి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పాలని సూచించారు.

అదేవిధంగా, పాఠశాల కరస్పాండెంట్ పుష్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించడం చాలా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చురుకుగా పాల్గొని రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు.

ఇక ఇదే సందర్భంగా, సమీప గ్రామంలో కూడా పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు జరిమానాలు విధిస్తూ, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ చర్యలు ప్రజల్లో భద్రతా చైతన్యం పెంపొందించడంలో కీలకంగా మారుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నవీన్, వైస్ ప్రిన్సిపల్ మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, సరిత, లావణ్య, ఆశ బేగం, రమేష్, సరిత, మమత, కావ్య, అనుష, కృష్ణ తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు





# మూల్యాంకన కేంద్రంపై అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- పదవ తరగతి సమాధాన పత్రాల దిద్దుబాటులో జాగ్రత్తలు పాటించాలన్న సూచన
- ఉపాధ్యాయులకు కనీస సౌకర్యాలపై దృష్టి
- భద్రత కట్టుదిట్టం చేయాలని ఆదేశం

**మేడ్చల్ మల్కాజిగిరి, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని బాలానగర్ పరిధిలో గల ఎన్ఎస్‌కెకె పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి సమాధాన పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ (ఐఏఎస్) ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి (డిఈఓ) విజయకుమారి కూడా హాజరయ్యారు.తనిఖీ సందర్భంగా మూల్యాంకన ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమాధాన పత్రాల దిద్దుబాటులో ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కూలర్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేసి ఫలితాల విడుదలకు సహకరించాలని సూచించారు.అలాగే, వాల్యుయేషన్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండేలా చూడాలని, అనధికార వ్యక్తులు లోపలికి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమం లో స్పాట్ క్యాంప్ అధికారులు, సహాయక సిబ్బంది, విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఆర్టిసన్ల సమ్మె తీవ్రం 8వ రోజుకు చేరిన నిరసన

- సైనిక్‌పురిలో భారీ ధర్నా
- ముత్యం వెంకన్న గౌడ్ సంఘీభావం
- భట్టి విక్రమార్కతో చర్చల హామీ

**సైనిక్‌పురి, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు)**





విద్యుత్ ఆర్టిసన్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారంతో ఎనిమిదవ రోజుకు చేరుకుంది. సైనిక్‌పురి డివిజన్ కార్యాలయం వద్ద వివిధ సెక్షన్లకు చెందిన కార్మికులు విధులను బహిష్కరించి భారీగా ధర్నా నిర్వహించారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమానికి విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్న గౌడ్ హాజరై కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్మికుల సమస్యలపై ఉన్నతాధికారులతో చర్చలు జరిపి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవసరమైతే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి సమస్య తీవ్రతను వివరిస్తామని హామీ ఇచ్చారు. సమ్మెలో భాగంగా కార్మికులు కార్యాలయ ప్రాంగణంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. అక్కడే భోజనాలు సిద్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ముత్యం వెంకన్న గౌడ్ స్వయంగా కార్మికులకు అన్నం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో హబ్సిగూడ సర్కిల్ జాక్ చైర్మెన్ వెంకట్ రెడ్డి, క్రిష్టాఫర్, జానయ్య, మల్లారెడ్డి, పైసా రవి, మోహన్ రావు, జానీ, ప్రసాద్, జమాల్, నరేష్ గౌడ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో పురుష, మహిళా ఆర్టిసన్ కార్మికులు పాల్గొన్నారు.ఎనిమిది రోజులుగా సమ్మె కొనసాగుతుండటంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ నిర్వహణ పనులు ప్రభావితమవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి చర్చలకు పిలవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# డ్రైనేజీ, సిమెంట్ రోడ్ల పనులు వేగవంతం చేయాలి

- మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌కు బస్తీ వాసుల వినతి
- పైపుల కొరతతో పనులు ఆలస్యం, త్వరలో ప్రారంభం హామీ

**నాచారం, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ బాబా నగర్ మరియు హనుమాన్ నగర్ సరిహద్దు ప్రాంతాల్లో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానిక బస్తీ వాసులు మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రాంతంలోని మౌలిక సదుపాయాల సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. హనుమాన్ నగర్ నుంచి బాబా నగర్ ఐస్ ఫ్యాక్టరీ చౌరస్తా వరకు భూగర్భ డ్రైనేజీ సమస్యలను ఇప్పటికే పరిష్కరించినప్పటికీ, ఐస్ ఫ్యాక్టరీ పక్క వీధి మరియు న్యూడిల్స్ వీధిలో డ్రైనేజీ పనులు ఇంకా ప్రారంభం కాలేదని స్థానికులు తెలిపారు. నిధులు మంజూరైనప్పటికీ పనులు ఆలస్యం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై స్పందించిన శాంతి సాయిజెన్ శేఖర్ జలమండలి అధికారులతో మాట్లాడగా, పైపులు స్టాక్‌లో లేకపోవడం వల్ల పనులు ఆలస్యం అవుతున్నాయని అధికారులు తెలిపారు.వెంటనే అవసరమైన పైపులు సమకూర్చి పనులు ప్రారంభించాలని ఆమె అధికారులను ఆదేశించారు.



డ్రైనేజీ పనులు పూర్తి చేసిన వెంటనే సిమెంటు రోడ్ల నిర్మాణం చేపడతామని ఆమె హామీ ఇచ్చారు.ఈకార్యక్రమం లో సుజాత, రవి, సురేష్, గోపి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# గొడవ తర్వాత యువకుడు అదృశ్యం

- జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు
- భర్త కోసం భార్య ఆందోళన

**జవహర్ నగర్, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఓ యువకుడు అదృశ్యమైన ఘటన నమోదైంది.పోలీసుల వివరాల ప్రకారం... సిఆర్పిఎఫ్ అరుంధతి నగర్‌కు చెందిన గగనం లలిత (25) తన భర్త స్వామితో కలిసి నివాసం ఉంటోంది. స్వామి చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 13వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో కాలనీలో చిన్న గొడవ జరిగింది.ఆ గొడవ అనంతరం స్వామి బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా అతని ఆచూకీ లభించలేదు.

దీంతో లలిత జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.స్వామి గురించి ఎవరైనా సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# కళలు మనసుకు ఆనందం పంచుతాయి

- పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు

**వనపర్తి,ఏప్రిల్15(తెలంగాణ ముచ్చట్లు):** కళలు మనసుకు ప్రశాంతతను, ఆనందాన్ని అందిస్తాయని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ పేర్కొన్నారు. ప్రపంచ కళా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక బాలభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాలభవన్ కళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా లావణ్య, ప్రసన్న, నిరీష, సాజిద్ బేగంలను శాలువాలు, జ్ఞాపికలతో గౌరవించారు.శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. కళలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా ప్రజల జీవితాలతో ముడిపడి ఉండాలని అన్నారు. వనపర్తి జిల్లాలో వివిధ కళా రంగాల్లో సేవలందిస్తున్న కళాకారులు ఎంతోమంది ఉన్నారని, వారి స్ఫూర్తితో రాబోయే తరాలు మన సంప్రదాయ కళలను కాపాడాలని సూచించారు. కళలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళా వేదిక ప్రతినిధులు బైరోజు చంద్రశేఖర్, దేశి రాములు యాదవ్, బండారు శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్ చారి, మద్దిలేటి, రమేష్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# కాలేజీకి వెళ్తున్నానని వెళ్లిన యువతి మిస్సింగ్

- కాలేజీకి రాలేదని యాజమాన్యం సమాచారం
- కుటుంబ సభ్యుల ఆందోళన,
- పోలీసుల దర్యాప్తు ప్రారంభం



**జవహర్ నగర్, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కాప్రా మండలంలోని కౌకూర్, భరత్ నగర్‌కు చెందిన దొమ్మరి బేబీ కుమార్తె భవాని (19) అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. భవాని ఈసీఐఎల్ ప్రాంతంలోని ఒమేగా డిగ్రీ కాలేజీలో ఫస్ట్ ఇయర్ చదువుతోంది.ఈ నెల 13వ తేదీ ఉదయం సుమారు 7:30 గంటలకు కాలేజీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి బయలుదేరిన భవాని, తిరిగి ఇంటికి చేరలేదు. అనుమానం వచ్చిన తల్లి బేబీ కాలేజీకి వెళ్లి ఆరా తీయగా, భవాని ఆ రోజు కాలేజీకి హాజరు కాలేదని యాజమాన్యం వెల్లడించింది.దీంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఎలాంటి సమాచారం లభించలేదు. చివరికి భవాని బాబాయ్ ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.భవాని ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



# పోషకాహార భద్రతకు పండ్ల చెట్లు అవసరం

- ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

**వనపర్తి ,ఏప్రిల్15(తెలంగాణ ముచ్చట్లు):** పోషకాహార భద్రతలో పండ్ల మరియు కూరగాయల మొక్కల ప్రాముఖ్యతను గ్రామస్తులకు తెలియజేయడానికి మొజర్ల ఉద్యాన కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ ప్రత్యేక శిబిరంలో భాగంగా పాలెం గ్రామంలో ఈ కార్యక్రమం జరిగింది .ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ ప్రతి కుటుంబం తమ ఇంటి వెనుక భాగంలో కనీసం 10 నుంచి 12 పండ్ల చెట్లు, వివిధ రకాల కూరగాయల మొక్కలను నాటుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వివరించారు. జామ, ఉసిరి, నిమ్మ, మామిడి, నేరేడు, బొప్పాయి వంటి చెట్లను పెంచడం ద్వారా స్వచ్ఛమైన, రసాయన రహిత పండ్లు సులభంగా అందుతాయని తెలిపారు. అలాగే ఆకుకూరలు, పూల మొక్కల పెంపకంపై కూడా సూచనలు ఇచ్చారు.కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి. గజానంద మాట్లాడుతూ ఉసిరి, నిమ్మ, వాక్కాయ, నారింజ పండ్లలో విటమిన్‌సీ సమృద్ధిగా ఉండి రోగ నిరోధక శక్తిని పెంచుతాయని తెలిపారు.సీతాఫలం, ద్రాక్ష, దానిమ్మ, అరటి పండ్లు శరీరానికి తక్షణ శక్తిని అందించి రక్తహీనతను తగ్గించడంలో సహాయపడతాయని వివరించారు. రైతులు వాణిజ్య పంటలతో పాటు తమ కుటుంబ ఆరోగ్య అవసరాల కోసం కూడా పండ్ల చెట్లను పెంచాలని సూచించారు. అనంతరం వాలంటీర్లు పండ్ల మొక్కలను నాటే విధానంపై రైతులకు ప్రాయోగికంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరుమలానగర్ కాలనీలో కమిషనర్ పర్యటన

- పెండింగ్ సమస్యల పరిష్కారానికి హామీ
- పాదయాత్రతో పరిస్థితుల సమీక్ష



**నాచారం, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమలానగర్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి బుధవారం పర్యటించారు. నాచారం డిప్యూటీ కమిషనర్ నిత్యానందం, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్, ఎంటమాలజీ తదితర విభాగాల అధికారులతో కలిసి కాలనీలో పాదయాత్ర నిర్వహించి, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కాలనీ ప్రెసిడెంట్ మల్లేష్ గౌడ్, సెక్రటరీ అమరేంద్రబాబు నేతృత్వంలో కమిటీ సభ్యులు అధికారులకు స్వాగతం పలికారు. కాలనీలో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్లు, మౌలిక వసతుల సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.ప్రజల విన్నపాలపై స్పందించిన కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరమని పేర్కొంటూ, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. చెత్తను రోడ్లపై వేయకుండా పరిశుభ్రత పాటించాలని కోరారు.ఇంటి ముందు నిర్మించే ర్యాంపులు రోడ్డుకు సమానంగా ఉండాలని, లేకపోతే డ్రైనేజీ ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని తెలిపారు. పర్యటనలో ఎంటమాలజీ విభాగం అధికారులు దోమల నివారణ చర్యలను సమీక్షించారు.కాలనీలో పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.





# సత్తుపల్లిలో వైద్య రంగానికి నూతన దశ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి మంత్రి పొంగులేటి చేతుల మీదుగా ఆస్పత్రుల ప్రారంభం

**సత్తుపల్లి, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి నియోజకవర్గం బుధవారం ఒక చారిత్రాత్మక ఘట్టానికి వేదికైంది. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఒకేరోజు మూడు ప్రభుత్వ ఆస్పత్రులను ప్రారంభించింది. రూ. 34 కోట్ల వ్యయంతో నిర్మించిన సత్తుపల్లి పట్టణం లో 100 పడకల వైద్య విధాన పరిషత్ ఏరియా ఆస్పత్రితో పాటు కల్లూరు (50 పడకలు), పెనుబల్లి (30 పడకలు) ఆస్పత్రులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యం అనే నమ్మకంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత పాలకులు కాగితాలకే పరిమితం చేసిన భవనాలను, అసంపూర్తిగా ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశామని తెలిపారు. ధనికులకు అందే వైద్యం పేదవారికి కూడా ఉచితంగా అందాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష అని పేర్కొన్నారు. అందుకే బాధ్యతలు చేపట్టిన 48 గంటల్లోనే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచినట్లు వివరించారు. విద్యా రంగానికి సంబంధించి పలు కీలక ప్రకటనలు చేస్తూ, జూన్ 2 నుండి ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గానికి రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు' విద్యా వ్యవస్థలో సరికొత్త మార్పులు తీసుకువస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయకుమార్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే సీజ్

- ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి హెచ్చరిక
- ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఆర్థిక భరోసా
- నాలాల డీసిల్టింగ్ పనులు గడువులో పూర్తి చేయాలని ఆదేశం





**మల్కాజ్‌గిరి, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ నగర పాలక సంస్థ అనుమతులకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమానాలతో పాటు భవనాలను సీజ్ చేయడానికీ వెనుకాడబోమని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి హెచ్చరించారు.99 రోజుల కార్యాచరణ-ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం తిరుమల నగర్, కృష్ణా నగర్, నాచారం, రాఘవేంద్ర నగర్, కార్తికేయ నగర్ ప్రాంతాల్లో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు.తిరుమల నగర్‌లో వాణిజ్య సముదాయాలను పరిశీలించిన కమిషనర్ ట్రేడ్ లైసెన్సుల పరిస్థితిని తనిఖీ చేశారు.సక్రమంగా నిర్వహించని ప్లాంటర్ బాక్స్‌లను తొలగించాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న భవనాల్లో నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్‌లు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.కృష్ణా నగర్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమైన కమిషనర్, వారికి రుణ సౌకర్యాలు, ఆర్థిక సహాయం అవకాశాలపై అవగాహన కల్పించారు. మహిళల ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.నాచారం ఎలిఫెంట్ సర్కిల్ వద్ద ఒక వాణిజ్య భవనంలో తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడ్డాయి. సెల్లార్ జీ+3 అంతస్తులకు మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ అదనంగా రెండు అంతస్తులు నిర్మించడమే కాకుండా రహదారి ఆక్రమణ కూడా చేసినట్లు గుర్తించారు. దీంతో పట్టణ ప్రణాళిక శాఖ అధికారులు ఆ భవనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.అదే విధంగా నాచారం పోలీస్ స్టేషన్ ఎదురుగా రాఘవేంద్ర నగర్‌లోని మరో భవనాన్ని కూడా అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టడం, సుమారు రూ.14 లక్షల ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో సీజ్ చేశారు.సంబంధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.కార్తికేయ నగర్‌లో నాలాల డీసిల్టింగ్ పనులను పరిశీలించిన కమిషనర్, పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేసి వర్షాకాలానికి ముందు నీటి ప్రవాహం సజావుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నగర అభివృద్ధి, పట్టణ ప్రణాళిక నియమాల అమలులో ఎలాంటి రాజీ ఉండదని కమిషనర్ స్పష్టం చేశారు.

# ప్రకృతి ఒడిలో పులిగుండాలు.. కొత్త ఆకర్షణ

- సఫారీ, బోటింగ్‌తో సందర్శకులకు ప్రత్యేక అనుభవం.





**సత్తుపల్లి, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలోని అపురూపమైన ప్రకృతి సంపదను ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం బ్రాహ్మళ్లకుంట పరిధిలోని పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్టును రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కలిసి బుధవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం వారు జంగిల్ సఫారీ, బోటింగ్ కార్యక్రమాలను ప్రారంభించి పులిగుండాల ప్రకృతి సోయగాలను ఆస్వాదించారు. అడవులు, కొండల మధ్య విరాజిల్లుతున్న ఈ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. పులిగుండాలకు రాకపోకలు సులభతరం చేయడానికి అక్కడికి వెళ్లే రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వెల్లడించారు. పులిగుండాలను రాష్ట్రంలో అగ్రశ్రేణి పర్యాటక కేంద్రాల్లో ఒకటిగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. పులిగుండాలకు సమీపంలోని కనకగిరి కొండలను కూడా పర్యాటకంగా అభివృద్ధి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పర్యాటకులకు మరింత ఆకర్షణీయంగా మారేలా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నుంచి పులిగుండాలకు నీటిని మళ్లించే అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని తెలిపారు. ఈ చర్య అమలైతే వేసవిలో కూడా పులిగుండాలు నీటితో కళకళలాడుతాయని, పర్యాటకులకు మరింత ఆకర్షణీయంగా మారుతాయని పేర్కొన్నారు. పర్యాటక రంగ అభివృద్ధితో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని మంత్రి చెప్పారు. గైడింగ్, బోటింగ్, చిన్న వ్యాపారాల ద్వారా ఆదాయం పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, పీసీసీఎఫ్ సువర్ణ, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కైలాసగిరి కమాన్ వద్ద జ్యూస్ బండి అగ్నికి ఆహుతి

- రాత్రి ఘటనలో పరికరాలు దగ్ధం...
- అనుమానితుడిపై పోలీసుల దర్యాప్తు

**కుషాయిగూడ, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జ్యూస్ బండి అగ్నిప్రమాదానికి గురైన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. ఇందిరానగర్ కైలాసగిరి కమాన్ హెచ్‌బి కాలనీకి చెందిన పెద్ద మాల కొండయ్య (40) జ్యూస్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు, ఈ నెల 13వ తేదీ రాత్రి సుమారు 10 గంటల సమయంలో తన జ్యూస్ బండిని మూసివేసి ఇంటికి వెళ్లాడు. అనంతరం కొద్దిసేపటికి తనకు తెలిసిన వ్యక్తి ఫోన్ చేసి బండి మంటల్లో కాలిపోతుందని తెలియజేశాడు. వెంటనే అక్కడికి చేరుకున్న అతను, అప్పటికే స్థానికులు మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు గుర్తించాడు.అయితే ఈ ఘటనలో జ్యూస్ బండిలో ఉన్న పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనకు డేవిడ్ అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




# రోడ్డు భద్రతపై జమ్మికుంటలో విద్యార్థుల చైతన్య యాత్ర

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా జమ్మికుంట జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మాధవి, సీఐ రామకృష్ణ గౌడ్ పాల్గొని విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా విద్యార్థులలో చైతన్యం పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువాతో సత్కరించి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.

అనంతరం విద్యార్థులతో కలిసి జమ్మికుంట పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రజలకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ నియమాలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు.



# జమ్మికుంటలో స్కానింగ్ సెంటర్లకు షాక్

- డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీలు

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రవణ్ జమ్మికుంట పట్టణంలోని మెగా డయాగ్నస్ సెంటర్, లోటస్ డయాగ్నిస్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా సెంటర్ నిర్వాహకులకు పీసీపీఎన్‌డీటీ చట్టం (గర్భధారణకు ముందు మరియు ప్రసవపూర్వ నిర్ధారణ పద్ధతులు - లింగ ఎంపిక నిషేధం చట్టం, 1994)ను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. రికార్డులను ఫారంఎఫ్‌లో సక్రమంగా నమోదు చేయాలని, లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లయితే పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే డయాగ్నస్టిక్ సెంటర్లకు వచ్చే రోగులకు సరైన సౌకర్యాలు కల్పించాలని, ఎటువంటి ఇబ్బందులకు గురి చేయరాదని, ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు.

ఈ తనిఖీలలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, సూపర్వైజర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# గోవా యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

**కుషాయిగూడ, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఆధ్వర్యంలో కుషాయిగూడ డిపో నుంచి ఐదు రోజుల గోవా యాత్రకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు.ఈ యాత్రలో గోవాతో పాటు గోకర్ణ, మురుడేశ్వర్, కుక్కే సుబ్రహ్మణ్యం, ఉడిపి, ధర్మస్థల వంటి ప్రముఖ పుణ్య క్షేత్రాల దర్శనం కూడా కల్పించనున్నారు.ప్రత్యేక బస్సు ఈ నెల 23వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు ఈసీఐఎల్ బస్టాండ్ నుంచి బయలుదేరనుంది. టికెట్ ధరను రూ.5,000గా నిర్ణయించారు.



భోజనం, వసతి ఖర్చులు ప్రయాణికులే భరించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.ఈ యాత్రలో పాల్గొనాలనుకునే వారు ముందస్తు బుకింగ్ కోసం ఫోన్ 9959226145, 9603549388 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కోకాపేటలో ముదిరాజ్ ఐక్యతకు నూతన దిశ

- అగ్ర నాయకుల సమక్షంలో భవన పనుల పరిశీలన
- "జాతి ప్రయోజనమే లక్ష్యం
- ఐక్యతే బలం" నినాదంతో ముందుకు

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** ముదిరాజ్ సమాజ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిర్మాణంలో ఉన్న ముదిరాజ్ భవన పనులు కోకాపేటలో వేగం పుంజుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ముదిరాజ్ అగ్ర నాయకులు ఐక్యంగా భవన నిర్మాణ స్థలాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు."జాతి ప్రయోజనమే మా లక్ష్యం -ఐక్యమత్యమే మా బలం" అనే నినాదంతో నాయకులు ఒక్కటై, రాజకీయ భేదాలు పక్కనపెట్టి జాతి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ ఐక్యత ముదిరాజ్ సమాజంలో నూతన ఉత్సాహాన్ని నింపింది. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల స్థలంలో నిర్మాణం జరుగుతున్న ఈ భవనాన్ని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, యువనేత కాసాని వీరేష్ తదితరులు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా పండగ సాయన్న సాహసం, కొరివి కృష్ణస్వామి ఆశయాలు, కానిస్టేబుల్ కృష్ణయ్య త్యాగాలను స్మరించుకుంటూ, ముదిరాజ్ సమాజ సర్వతోముఖాభివృద్ధికి కంకణం కట్టుకున్నట్లు నాయకులు తెలిపారు.



# కీసరలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

- 'అరైవ్-అలైవ్'లో భాగంగా విద్యార్థులతో మానవహారం
- ట్రాఫిక్ నియమాలపై చైతన్యం

**కీసర, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'అరైవ్అలైవ్' కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జవహర్‌నగర్ ఏసీపీ చక్రపాణి, కీసర సీఐ ఆంజనేయులు, ఎస్ఐ హరి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించిన సందేశాలతో వారు ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ ధరించడం, వేగ నియంత్రణ వంటి ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మానవహారం ఏర్పాటు చేసి రోడ్డు భద్రతపై సందేశాన్ని బలంగా తెలియజేశారు.ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుండి మంచి స్పందన లభించింది.




# రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నేత జావీద్ మృతి

- తుమ్మల యుగంధర్ నివాళులు
- టీజీఐడీసీ ఛైర్మన్ ముమ్మా విజయబాబు సంతాపం

**సత్తుపల్లి, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** సూర్యాపేట జిల్లా పిల్లలమర్రి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం నగర మాజీ అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు మహ్మద్ జావీద్ మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. పార్టీకి నిబద్ధతతో పనిచేసిన మైనార్టీ నాయకుడి అకాల మరణం కాంగ్రెస్ వర్గాల్లో శోకసంద్రాన్ని మిగిల్చింది. జావీద్ భౌతికకాయాన్ని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ తుమ్మల యుగంధర్ సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జావీద్





మరణం పార్టీకి తీరని లోటని, ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

అలాగే టీజీఐడీసీ ఛైర్మన్ ముమ్మా విజయబాబు కూడా జావీద్ మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మైనార్టీ నాయకుడిగా పార్టీకి విశేష సేవలు అందించిన జావీద్ మృతి బాధాకరమని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, సీనియర్ నాయకులు మానుకొండ రాధాకిషోర్, కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, జిల్లా నాయకులు సాధు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై గళమెత్తిన జమ్మికుంట మార్కెట్ ఛైర్‌పర్సన్

**బీఆర్‌కే భవన్‌లో కీలక చర్చలు**

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అధ్యక్షతన కీలక సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి జమ్మికుంట మార్కెట్ ఛైర్‌పర్సన్ పుల్లూరు స్వప్న హాజరయ్యారు.

ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ మార్కెటింగ్‌లో ఉన్న ఇబ్బందులను ఆమె కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా మార్కెట్‌లో రైతులు ఎదుర్కొంటున్న లోపాలు, ధరల సమస్యలు, సౌకర్యాల కొరతపై వివరంగా చర్చించారు.

రైతుల పరిస్థితిని మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. సమావేశంలో కమిషన్ సభ్యులు, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.



# డిస్నీలో ఉద్యోగాల కోత

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ ప్రఖ్యాత వినోద సంస్థ ద వాల్ట్ డిస్నీ కంపెనీ మరోసారి ఉద్యోగాల కోత నిర్ణయంతో వార్తల్లో నిలిచింది. సంస్థ కొత్త సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన జోష్ డి అమారో, పదవిలోకి వచ్చిన కేవలం నెల రోజుల్లోనే ఈ కఠిన నిర్ణయం తీసుకోవడం పరిశ్రమ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

సమాచారం ప్రకారం సంస్థ సుమారు వెయ్యి మంది ఉద్యోగులను తొలగించే ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ కోతలు ప్రధానంగా మార్కెటింగ్, స్టూడియోలు, టెలివిజన్ వ్యాపారం, క్రీడా విభాగం, ఉత్పత్తి మరియు సాంకేతిక విభాగాలతో పాటు కొన్ని కార్పొరేట్ విభాగాల్లో అమలు కానున్నాయి.

ప్రస్తుతం డిస్నీ సంస్థ మార్కెటింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు 'ఏకీకృత మార్కెటింగ్ నిర్మాణం'ను అమలు చేస్తోంది. ఈ మార్పులను అసద్ అయ్యాజ్ ఆధ్వర్యంలో చేపడుతున్నారు. సంస్థ కార్యకలాపాలను సులభతరం చేయడం, ఖర్చులను తగ్గించడం, కొత్త సాంకేతికతకు అనుగుణంగా వ్యవస్థను మలచడం లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

వినోద రంగంలో వేగంగా మారుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా సంస్థను పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని సీఈఓ జోష్ డి అమారో తన ప్రకటనలో తెలిపారు.




గత కొద్ది నెలలుగా సంస్థలోని విభాగాల పనితీరును సమీక్షించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

ఈ చర్యలతో సంస్థ మరింత చురుకైన వ్యవస్థగా మారుతుందని, దీర్ఘకాలికంగా అభివృద్ధికి దోహదపడుతుందని కంపెనీ భావిస్తోంది. అయితే మరోవైపు ఉద్యోగాల కోత కారణంగా ఉద్యోగుల్లో ఆందోళన నెలకొనగా, పరిశ్రమలో కూడా ఈ నిర్ణయం విస్తృత చర్చకు దారితీసింది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఆరోగ్యం, విద్యుత్ రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత





- **తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**
- **డిప్యూటీ సీఎం భట్టితో కలిసి కల్లూరు మండలంలో పర్యటన**

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 15(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే విద్యుత్, ఆరోగ్య రంగాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలంగాణ రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం కల్లూరు మండలంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన పర్యటించారు. కల్లూరులో రూ.10.50 కోట్లతో నిర్మించిన 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించడంతో పాటు, నారాయణపురంలో రూ.2.75 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు సమీపంలోనే మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈ ఆసుపత్రి కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అలాగే కొత్తగా నిర్మించనున్న విద్యుత్ ఉపకేంద్రం ద్వారా పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, ఎన్.పి.డి.సి.ఎల్ సీఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ విస్తరణతో గ్రామీణాభివృద్ధి: భట్టి విక్రమార్క

- **రేజర్లలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన.**



**సత్తుపల్లి, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌళిక వసతుల విస్తరణతో పేదల అభివృద్ధి సాధ్యమవుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ రైతులు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అవసరమైన చోట కొత్త ఉపకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ భూముల్లో ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామని, గ్రామంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళల ఆర్థికాభివృద్ధికి వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో ఉన్నప్పటికీ పేదల సంక్షేమం విషయంలో రాజీ పడబోమన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయంతో అమలు చేస్తున్నామని చెప్పారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ త్వరలోనే మరో విడత ఇందిరమ్మ ఇళ్ల జాబితా విడుదల అవుతుందని తెలిపారు. సుమారు 400 మందికి గృహ స్థలాల కేటాయింపుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# పోషణ పక్వాడలో భాగంగా కీసర అంగన్వాడిలో అవగాహన

- **తల్లి, శిశు ఆరోగ్యంపై దృష్టి**
- **పోషకాహారంపై తల్లులకు సూచనలు**




**కీసర, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ జిల్లా కీసర మండలంలోని థర్డ్ అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాల సందర్భంగా పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ప్రతి అంగన్వాడి కేంద్రంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు .ఈ సందర్భంగా తల్లులకు పిల్లల అభివృద్ధి మైలురాళ్లు, శిశు సంరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించారు.పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇవ్వడం, ఆరు నెలల వరకు పూర్తిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ఎంతో ముఖ్యమని వివరించారు. అనంతరం ఏడో నెల నుంచి అదనపు ఆహారం (కాంప్లిమెంటరీ ఫీడింగ్) ప్రారంభించి, తల్లిపాలతో పాటు కొనసాగించాలని సూచించారు. అలాగే తల్లి, శిశువులు ఆరోగ్యంగా ఉండేందుకు స్థానికంగా లభించే పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు వంటి మిల్లెట్స్‌ను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు."నేటి బాలలే రేపటి పౌరులు" అనే నినాదంతో జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి, ఇంటి ఆహారానికే ప్రాధాన్యత ఇవ్వాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శారదా, సూపర్వైజర్ సక్కు భాయ్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతి



- **మద్యం మత్తులో కాంపౌండ్ వాల్ నుంచి పడిపోవడంతో ప్రమాదం**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు**

**కుషాయిగూడ, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. బుధవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు సుమారు రాత్రి 10:30 గంటల సమయంలో 100 డయల్ కాల్ వచ్చింది. సమాచారం మేరకు కందిగూడలోని మాణిక్ సాయి ఎంక్లేవ్ వద్దకు చేరుకున్న పోలీసులు, అక్కడ ఓ వ్యక్తి కిందపడి ఉన్నట్లు గుర్తించారు.తక్షణమే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా, అక్కడికి చేరుకున్న వైద్య సిబ్బంది అతడిని పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. స్థానికులను విచారించగా, మృతుడు కొంతసేపు పార్క్ కాంపౌండ్ వాల్‌పై కూర్చొని మద్యం సేవిస్తున్నట్లు తెలిపారు. మద్యం మత్తులో ఉండగా కిందపడిపోవడంతో గాయాల కారణంగా మృతి చెందినట్లు అనుమానం వ్యక్తమవుతోంది.మృతుడి వయస్సు సుమారు 30 నుండి 40 సంవత్సరాల మధ్య ఉండగా, ఆకుపచ్చ టీషర్ట్, నలుపు జీన్స్ ప్యాంట్, నలుపు బెల్ట్ ధరించి ఉన్నాడు. ఎత్తు సుమారు 5.6 అడుగులు, చామన చాయ వర్ణంతో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మోర్చరీకి తరలించిన పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ముందుకు రావాలని పోలీసులు కోరుతున్నారు.

# డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఉపసర్పంచుల ఐక్య గళం... తహసీల్దార్‌కు వినతి



**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద గత 24 రోజులుగా కొనసాగుతున్న వేస్ట్ టు ఎనర్జీ పవర్ ప్లాంట్, డంపింగ్ యార్డ్ నిర్మాణానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరవధిక దీక్షకు ఉపసర్పంచులు మద్దతు తెలిపారు. జేఏసీ పిలుపు మేరకు ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షులు వన్నాల శివాజీ ఆధ్వర్యంలో మండలంలోని 20 గ్రామాల ఉపసర్పంచులు ఒకరోజు దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వన్నాల శివాజీ మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్ రద్దు అయ్యేంత వరకు అన్ని గ్రామాల ఉపసర్పంచులు ఏకమై శాంతియుతంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు వెనక్కి తగ్గబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంద సతీష్, శనిగరపు ఐలయ్య, గీసిడి శైలజ, మహేందర్ రెడ్డి, బండి రాజు, బండి నరేష్, జనగామ రాజేశ్వరరావు, ఇప్పలపల్లి రామకృష్ణ, గిన్నారపు మహేందర్, బొల్లవేణి అజయ్, ఆవుల రాజకుమార్, నేరెళ్ల శ్రీనివాస్, జడల అశోక్ కుమార్, ఆవుల సంపత్, కాశిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నారాయణరెడ్డి, బిక్షపతి, జాలి బలరాం రెడ్డి, పంజాల రాజు, సుధాకర్ తదితర ఉపసర్పంచులు పాల్గొన్నారు. అలాగే అఖిలపక్ష జేఏసీ సభ్యులు జనార్ధన్, సందేల వెంకన్న, హనుమంతరావు, జైపాల్ రెడ్డి, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కొండల్ రెడ్డి, కాట్రపల్లి మాజీ సర్పంచ్ తొగరు బిక్షపతి తదితరులు మద్దతు తెలిపారు. అనంతరం స్థానిక తహసీల్దార్‌కు మెమోరాండం సమర్పించారు.

# తెలంగాణ ప్రకృతి సంపదను ప్రపంచానికి పరిచయం చేయడమే ప్రభుత్వ లక్ష్యం



- **డబుల్ రోడ్డుకు గ్రీన్ సిగ్నల్.. సీతారామ జలాల మళ్లింపుపై అధ్యయనం**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 15(తెలంగాణ ముచ్చట్లు):** పెనుబల్లి మండలం బ్రాహ్మళ్లకుంట పరిధిలోని పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్టును బుధవారం తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ప్రారంభించారు. అలాగే వారు జంగిల్ సఫారీ, బోటింగ్‌లను ప్రారంభించి ప్రకృతి ఒడిలో కాసేపు విహరించారు.

అభివృద్ధి బాటలో 'కనకగిరి'

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. తెలంగాణలోని అపురూపమైన ప్రకృతి సంపదను ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. "పులిగుండాలను రాష్ట్రంలోని మొదటి మూడు ఉత్తమ పర్యాటక కేంద్రాలలో ఒకటిగా నిలబెడతాం. పర్యాటకుల రాకపోకలకు వీలుగా ఇక్కడికి వెళ్లే మార్గాన్ని వెంటనే డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు అనుమతులు మంజూరు చేస్తాం" అని ప్రకటించారు. కనకగిరి హిల్స్ అభివృద్ధికి తక్షణమే కార్యాచరణ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

సీతారామ నీళ్లతో నిరంతర జలకళ

స్థానిక ఎమ్మెల్యే విన్నపం మేరకు.. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నుంచి పులిగుండాలకు నీటిని మళ్లించే సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. తద్వారా వేసవిలోనూ ఈ ప్రాంతం జలకళతో ఉట్టిపడుతుందని, పర్యాటక రంగానికి ఊతమివ్వడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, పీసీసీఎఫ్ సువర్ణ, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మహమ్మద్ జావేద్ మృతి పట్ల మంత్రి పొంగులేటి తీవ్ర దిగ్భ్రాంతి



- **నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయామని ప్రకటన**

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 15(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు, పీసీసీ సభ్యులు మహమ్మద్ జావేద్ దుర్మరణం పట్ల తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

సూర్యాపేట జిల్లా మోతే వద్ద బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో జావేద్ మరణించారన్న వార్త తనను తీవ్రంగా కలచివేసిందని మంత్రి పేర్కొన్నారు. ఖమ్మం రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జావేద్, పార్టీ కోసం నిరంతరం అంకితభావంతో పనిచేశారని మంత్రి కొనియాడారు. ప్రజా సమస్యలపై స్పందించే గుణం, పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే నేర్పు కలిగిన నాయకుడు జావేద్ అన్నారు. ఆయన మరణం కాంగ్రెస్ శ్రేణులకు తీరని లోటని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. జావేద్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని అల్లాను ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు ఈ తీరని దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని మంత్రి తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

# మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థినుల ప్రభంజనం

- **ఇంటర్ ఫలితాల్లో మెరిసిన ప్రతిభ**
- **990కి పైగా మార్కులతో టాపర్లు**



**నాచారం, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ మల్కాజిగిరి గురుకుల జూనియర్ కళాశాల-I విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచి అద్భుత ఫలితాలు సాధించారు.రెండవ సంవత్సరం ఎంపీసీ విభాగంలో శ్రావ్య, మహిశ్రీలు 1000 మార్కులకు గాను 990 మార్కులు సాధించి టాప్ ర్యాంకులు సాధించగా, యశ్విత 980 మార్కులతో మెరిసింది. బైపీసీ విభాగంలో మహియ 965 మార్కులు, సంజన 927 మార్కులు సాధించి మంచి ఫలితాలు నమోదు చేశారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో శరణ్య 470కి గాను 461 మార్కులు, షైక్ ఆసిఫా 458 మార్కులు సాధించగా, బైపీసీ విభాగంలో సయ్యద్ షెస్తా 440కి గాను 435 మార్కులు, శ్వేత శ్రీ 433 మార్కులు సాధించి ప్రతిభను చాటారు.మొత్తంగా రెండవ సంవత్సరం విద్యార్థినులు 98 శాతం ఉత్తీర్ణత సాధించగా, మొదటి సంవత్సరం విద్యార్థినులు 92 శాతం ఉత్తీర్ణత నమోదు చేయడం విశేషంగా నిలిచింది .ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. శైలజి మాట్లాడుతూ విద్యార్థినుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# రీల్స్ మాయలో యువత: వినోదమా? వ్యసనమా?



స్మార్ట్‌ఫోన్ విప్లవంతో పాటు సోషల్ మీడియా వినియోగం విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా చిన్న చిన్న వీడియోల రూపంలో వస్తున్న 'రీల్స్' యువతను ఆకర్షిస్తున్నాయి. 2026 నాటి తాజా గణాంకాల ప్రకారం, భారతదేశంలో ప్రతి ముగ్గురు యువకులలో ఒకరు సోషల్ మీడియా వ్యసనంతో బాధపడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. కొద్ది సెకన్ల వినోదం కోసం ప్రారంభమైన ఈ అలవాటు, క్రమంగా గంటల సమయాన్ని హరిస్తూ వ్యసనంగా మారుతోంది. చదువు, పని, వ్యక్తిగత జీవితంపై దాని ప్రభావం రోజురోజుకు పెరుగుతోంది. ఎకనామిక్ సర్వే 202526 కూడా ఈ డిజిటల్ వ్యసనం ఉత్పాదకతను తగ్గిస్తుందని హెచ్చరించింది.

రీల్స్ చూడటం మొదట సరదాగా అనిపించినా, ఆలస్యంగా అది అలవాటుగా మారుతుంది. ఒక వీడియో తర్వాత మరో వీడియో చూస్తూ సమయం ఎలా గడిచిపోతుందో తెలియదు. ముఖ్యంగా విద్యార్థులు తమ చదువుపై దృష్టి కోల్పోతున్నారు. ఏకాగ్రత తగ్గిపోవడం, పనులను వాయిదా వేయడం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. నిరంతరం మారుతున్న దృశ్యాల వల్ల మెదడులో 'డోపమైన్' అనే రసాయనం విడుదలై, మెదడును తక్షణ సంతృప్తికి అలవాటు చేస్తోంది. దీనివల్ల లోతైన ఆలోచనలు చేయడం, ఎక్కువ సేపు ఒకే పనిపై దృష్టి పెట్టడం యువతకు కష్టతరంగా మారుతోంది. మానసిక ఆరోగ్యంపై కూడా ఈ రీల్స్ ప్రభావం తీవ్రంగా ఉంది. నిరంతరం ఇతరుల జీవితాలను చూస్తూ పోలికలు చేసుకోవడం వల్ల అసంతృప్తి, ఒత్తిడి, ఆత్మవిశ్వాసం తగ్గిపోవడం జరుగుతోంది. నిద్రలేమి, ఆందోళన, ఒంటరితనం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. 2026లో జరిగిన తాజా పరిశోధనల ప్రకారం, అధికంగా రీల్స్ చూసే వారిలో కుంగుబాటు లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం ఒక అలవాటు మాత్రమే కాదని, మెదడు నిర్మాణంలో మార్పులకు దారితీసే గంభీరమైన సమస్యని విశ్లేషిస్తున్నారు.

ఈ పరిస్థితిని మార్చడానికి స్వీయ నియంత్రణ అత్యవసరం. రోజుకు ఎంత సమయం సోషల్ మీడియాకు కేటాయించాలో నిర్ణయించుకోవాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలపై పర్యవేక్షణ పెంచాలి. స్కూళ్లు మరియు కళాశాలల్లో డిజిటల్ వెల్‌నెస్ పాఠ్యాంశాలను చేర్చాలని నిపుణులు సూచిస్తున్నారు. సాంకేతికతను పూర్తిగా నిరాకరించడం సాధ్యం కాదు కానీ దాని వినియోగంలో సమతుల్యత అవసరం. అవసరమైతే 'స్క్రీన్ టైమ్ లిమిట్స్' పెట్టుకోవడం లేదా నిర్ణీత సమయాల్లో ఫోన్‌కు దూరంగా ఉండే 'డిజిటల్ డిటాక్స్' పద్ధతులను పాటించడం వల్ల మేలు జరుగుతుంది.

నిజమైన ఆనందం వర్చువల్ ప్రపంచంలో కాదు, నిజ జీవితంలోనే ఉందని యువత గుర్తించాలి. తాత్కాలిక వినోదం కోసం విలువైన సమయాన్ని వృథా చేయకుండా, లక్ష్యాల వైపు దృష్టి పెట్టడం అత్యవసరం. స్మార్ట్‌ఫోన్ మనల్ని నియంత్రించకుండా, మనమే దానిని నియంత్రించే స్థితిలో ఉండాలి. కుటుంబ సభ్యులతో గడపడం, వ్యాయామం, మరియు పుస్తక పఠనం వంటి అలవాట్లు ఈ వ్యసనం నుండి బయటపడటానికి సహకరిస్తాయి. యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఈ డిజిటల్ మాయాజాలం నుండి బయటపడి వాస్తవ ప్రపంచంలో రాణించాలని ఆశిద్దాం.



# గుర్తింపు లేని గాధ

దేశ అభివృద్ధికి అజ్ఞాత సైనికుల్లా పనిచేస్తున్న వలస కార్మికులు, సమాజంలో అత్యంత నిర్లక్ష్యం ఎదుర్కొంటున్న వర్గంగా నిలుస్తున్నారు. వీరి చెమటతో నిర్మితమవుతున్న రహదారులు, భవనాలు, పరిశ్రమలు దేశానికి ఆధారం అయినా, వారి జీవితం మాత్రం గుర్తింపు లేని గాధగానే మిగులుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల కొరత, వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాల ఆర్థిక అస్థిరత వలసల ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. గ్రామాల్లో వరుసగా ఎదురవుతున్న వర్షాభావం, పంటల నష్టాలు, అప్పుల భారంతో జీవనం కష్టతరమవుతోంది. ఈ పరిస్థితుల్లో జీవనోపాధి కోసం నగరాల వైపు వలస వెళ్లడం చాలా మందికి తప్పని పరిస్థితిగా మారింది. అయితే ఈ మార్పు వారి జీవితంలో స్థిరత్వాన్ని ఇవ్వకుండా మరిన్ని సవాళ్లను తెస్తోంది. నగరాల్లోకి చేరిన తర్వాత వలస కార్మికులు ఎదుర్కొనే పరిస్థితులు అత్యంత క్లిష్టంగా ఉంటాయి. తక్కువ వేతనాలు, ఎక్కువ పని గంటలు, కాంట్రాక్టర్ల ఆధీనంలో పని చేయడం వల్ల వారి హక్కులు దెబ్బతింటున్నాయి. శ్రమకు తగిన ప్రతిఫలం లభించకపోవడం వారి ఆర్థిక స్థితిని మరింత దెబ్బతీస్తోంది. నివాస సమస్యలు కూడా ఈ వర్గాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. బస్తీల్లో లేదా తాత్కాలిక గుడిసెల్లో నివసిస్తూ, తాగునీరు, పారిశుధ్యం వంటి ప్రాథమిక సౌకర్యాలు లేకుండా జీవనం సాగిస్తున్నారు. ఈ పరిస్థితులు ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి.

మహిళా వలస కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుంది. పని స్థలాల్లో వేధింపులు, తక్కువ వేతనాలు, భద్రతా లోపాలు వారి జీవితం మీద తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. అదే సమయంలో కుటుంబ బాధ్యతలు కూడా వారి మీదే ఉండటంతో మానసిక ఒత్తిడి పెరుగుతోంది. వలస కార్మికుల పిల్లలు విద్య విషయంలో వెనుకబడుతున్నారు. తరచూ చోటు మారడం వల్ల చదువు మధ్యలోనే ఆగిపోవడం సాధారణంగా మారింది. సరైన విద్య అందకపోవడం వారి భవిష్యత్తును అనిశ్చితిలోకి నెడుతోంది.

ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా, అవి వలస కార్మికులకు పూర్తిగా చేరడం లేదు. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి మారినప్పుడు రేషన్ కార్డులు, ఆరోగ్య సేవలు, ఇతర సౌకర్యాలు అందకపోవడం పెద్ద సమస్యగా ఉంది. డేటా లోపం, వ్యవస్థలో సమన్వయం లేకపోవడం కారణంగా వీరు అనేక ప్రయోజనాలను కోల్పోతున్నారు. కరోనా కాలంలో వలస కార్మికుల పరిస్థితి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పని లేకుండా, ఆదాయం లేకుండా వేల కిలోమీటర్లు నడిచి తమ గ్రామాలకు వెళ్లిన సంఘటనలు వారి అస్థిర జీవనాన్ని బహిర్గతం చేశాయి. అయినప్పటికీ పరిస్థితుల్లో పెద్ద మార్పులు కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

వలస కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి సమగ్ర విధానాలు అవసరం. పోర్టబుల్ సంక్షేమ పథకాలు, కనీస వేతనాల కఠిన అమలు, ఆరోగ్య భద్రత, సరైన నివాస సదుపాయాల కల్పన వంటి చర్యలు అత్యవసరం. వారి పిల్లలకు నిరంతర విద్య అందించే విధానాలు రూపొందించాలి. సమాజం కూడా ఈ వర్గాన్ని గుర్తించి గౌరవించే దిశగా ముందుకు రావాలి. వలస కార్మికుల శ్రమ లేకుండా అభివృద్ధి అసాధ్యం. వారి జీవితాల్లో మార్పు తీసుకురావడం ద్వారా మాత్రమే నిజమైన సమానత్వం సాధ్యమవుతుంది. అభివృద్ధి అంటే కేవలం భవనాలు కాదు, వాటిని నిర్మించే మనుషుల జీవితాలు మెరుగుపడటమే అసలు అభివృద్ధి అని గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.

నగరాల్లోకి వచ్చిన తరువాత ఈ వలస కార్మికులు ఎదుర్కొనే సమస్యలు మరింత కఠినంగా ఉంటాయి. తక్కువ వేతనాలు, ఎక్కువ పని గంటలు, సరైన నివాసం లేకపోవడం, ఆరోగ్య సదుపాయాల లేమి వంటి సమస్యలు వారి రోజువారీ జీవితాన్ని సంక్లిష్టంగా మార్చుతున్నాయి. అనధికార రంగంలో పనిచేసే వీరికి ఉద్యోగ భద్రత లేకపోవడం, ఎప్పుడు పని కోల్పోతామో అన్న భయం వెంటాడుతోంది. ముఖ్యంగా మహిళా వలస కార్మికులు మరింత శారీరక, మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రకటించినా, వాటి ప్రయోజనాలు వలస కార్మికులకు పూర్తిగా అందడం లేదు. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మారే సమయంలో రేషన్ కార్డులు, ఆరోగ్య పథకాలు, పిల్లల విద్య వంటి సేవలు నిరంతరంగా అందకపోవడం పెద్ద సమస్యగా మారుతోంది. అధికార వ్యవస్థలో సమన్వయం లోపం, సరైన డేటా లేకపోవడం వల్ల ఈ వర్గం ఎప్పటికప్పుడు వ్యవస్థకు దూరంగా మిగులుతోంది. వలస కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి సమగ్ర విధానాలు అవసరం. పోర్టబుల్ సంక్షేమ పథకాలు, కనీస వేతనాల అమలు, ఆరోగ్య, నివాస సదుపాయాల కల్పన, పిల్లలకు నిరంతర విద్య వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. సమాజం కూడా వీరి పట్ల సానుభూతితో వ్యవహరించి, వారి శ్రమను గౌరవించే సంస్కృతి పెంపొందించాలి. అభివృద్ధి అసలైన అర్థం, ఈ వలస కార్మికుల జీవితం మెరుగుపడినప్పుడే సాకారం అవుతుంది.



# మానవ సృజనాత్మకతకు అద్దం పట్టే అద్భుత వేదిక

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 15వ తేదీన ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ కళా దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. మానవ మేధస్సు నుండి ఉద్భవించే సృజనాత్మకతను గౌరవించడానికి, కళల పట్ల సామాన్య ప్రజానీకంలో అవగాహన కల్పించడానికి యునెస్కో ఈ రోజును కేటాయించింది. కళ అనేది కేవలం రంగులు, శబ్దాల కలయిక మాత్రమే కాదు, అది ఒక సంస్కృతి యొక్క జీవన విధానాన్ని మరియు చరిత్రను ప్రతిబింబించే అద్దం వంటిది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల మధ్య ఉన్న భౌగోళిక సరిహద్దులను చెరిపివేసి, మానవత్వాన్ని ఏకం చేసే శక్తి ఒక్క కళకు మాత్రమే ఉంది.

ఈ ప్రత్యేక దినోత్సవాన్ని జరుపుకోవడానికి ప్రధాన కారణం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కళాకారుడు లియోనార్డో డా విన్సీ. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని ఈ రోజును ప్రపంచ కళా దినోత్సవంగా నిర్ణయించారు. డా విన్సీ కేవలం చిత్రకారుడు మాత్రమే కాదు, ఆయన ఒక గొప్ప శిల్పి, సంగీత విద్వాంసుడు మరియు శాస్త్రవేత్త. ఆయన గీసిన 'మోనాలిసా' చిత్రం నేటికీ ప్రపంచంలోనే అత్యంత రహస్యమైన మరియు అందమైన కళాఖండంగా నిలిచిపోయింది. ఆయనలోని బహుముఖ ప్రజ్ఞను స్మరించుకుంటూ, ప్రతి ఒక్కరిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే ఈ రోజు యొక్క ముఖ్య ఉద్దేశ్యం. కళలు మనిషి యొక్క మానసిక స్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడికి లోనవుతున్న ఆధునిక మానవుడికి సంగీతం, చిత్రలేఖనం వంటి కళలు ఎంతో ఉపశమనాన్ని ఇస్తాయి. కళాత్మక వాతావరణం ఉన్న చోట శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తాయని చరిత్ర చెబుతోంది. అందుకే విద్యార్థి దశ నుండే పిల్లలకు కళల పట్ల ఆసక్తిని పెంపొందించడం చాలా అవసరం. ఇది వారిలో విశ్లేషణాత్మక ఆలోచనలను మరియు సామాజిక స్పృహను పెంపొందిస్తుంది. కళా హృదయం ఉన్న వ్యక్తి సమాజాన్ని మరింత సున్నితంగా అర్థం చేసుకోగలడు.

నేటి డిజిటల్ యుగంలో కళల పరిధి మరింత విస్తరించింది. సాంకేతికత తోడ్పడంతో గ్రాఫిక్ డిజైనింగ్, డిజిటల్ పెయింటింగ్ మరియు యానిమేషన్ వంటి కొత్త రూపాలు సంతరించుకున్నాయి. ఇవి కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా, లక్షలాది మందికి ఉపాధిని కూడా కల్పిస్తున్నాయి. సినిమా, వెబ్ సిరీస్ మరియు సోషల్ మీడియా వేదికల ద్వారా కళాకారులు తమ ప్రతిభను ప్రపంచవ్యాప్తంగా చాటుకుంటున్నారు. ఏ రూపంలో ఉన్నా, కళ అనేది సత్యాన్ని మరియు అందాన్ని అన్వేషించే ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగుతూనే ఉంది. మన దేశంలో కూడా ఎన్నో ప్రాచీన కళలు అంతరించిపోయే దశలో ఉన్నాయి. జానపద కళలు, ప్రాచీన శిల్ప కళ మరియు చేనేత వంటివి మన వారసత్వ సంపద. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే కాకుండా ప్రతి పౌరుడిపై ఉంది. ప్రపంచ కళా దినోత్సవం సందర్భంగా ఇటువంటి కళలను ఆదరించడం మరియు కళాకారులను ప్రోత్సహించడం మన ధర్మం. కళాకారులకు సరైన గుర్తింపు మరియు ఆర్థిక తోడ్పాటు అందించినప్పుడే వారు మరిన్ని అద్భుతాలను సృష్టించగలరు. ఈ వేదికల ద్వారా వారి సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలు అన్వేషించాలి.

కళ అనేది ఒక విశ్వభాష. భాష తెలియకపోయినా ఒక చిత్రం చూసి మనం భావోద్వేగానికి లోనవుతాం, ఒక రాగం విని మనం పరవశిస్తాం. అందుకే ఇది దేశాల మధ్య శాంతిని నెలకొల్పడానికి ఒక వారధిలా ఉపయోగపడుతుంది. వివిధ దేశాల సంస్కృతులను అర్థం చేసుకోవడానికి కళలు ఎంతగానో దోహదపడతాయి. అంతర్జాతీయ స్థాయిలో జరిగే కళా ప్రదర్శనలు ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలను పెంపొందిస్తాయి. వైవిధ్యంలో ఏకత్వాన్ని చాటడానికి కళారంగం ఒక గొప్ప వేదికగా మారుతోంది. ప్రపంచ కళా దినోత్సవం సందర్భంగా అనేక ప్రాంతాల్లో చిత్రలేఖన పోటీలు, నాటక ప్రదర్శనలు మరియు సంగీత కచేరీలు నిర్వహిస్తారు. కళాకారులు తమ అనుభవాలను పంచుకుంటూ కొత్త తరం వారికి స్ఫూర్తినిస్తారు. ప్రతి గల్లిలోనూ, ప్రతి ఇంట్లోనూ ఒక కళాకారుడు ఉంటాడని గుర్తించి, వారిని ప్రోత్సహించే వాతావరణం ఏర్పడాలి. సృజనాత్మకతకు ఎటువంటి అడ్డంకులు ఉండకూడదని, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ భావాలను కళా రూపంలో వ్యక్తపరచాలని ఈ రోజు పిలుపునిస్తోంది. ఇది కేవలం ఒక రోజు వేడుకగా కాకుండా నిరంతర ప్రక్రియగా సాగాలి. కళ లేని జీవితం రంగులు లేని చిత్రం వంటిది. మానవ మనుగడకు, నాగరికతకు కళలే ప్రాణాధారం. మన చుట్టూ ఉన్న ప్రకృతిని, సమాజాన్ని కొత్త కోణంలో చూడటం నేర్పేదే కళ. ఈ ప్రపంచ కళా దినోత్సవం సందర్భంగా మనలోని సృజనాత్మకతను నిద్రలేపుదాం. కళలను ప్రేమిద్దాం, కళాకారులను గౌరవిద్దాం. అందమైన, ప్రశాంతమైన మరియు సృజనాత్మకమైన ప్రపంచ నిర్మాణంలో మన వంతు పాత్ర పోషిద్దాం. కళ అనేది చిరస్థాయిగా నిలిచిపోయే ఒక అద్భుత శక్తి అని చాటి చెబుతూ ఈ ఉత్సవాలను విజయవంతం చేద్దాం.

# గ్రామీణాభివృద్ధికి కొత్త దిశానిర్దేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రాజేంద్రనగర్‌లోని టీజీ ఐఆర్డీ కార్యాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క బుధవారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. సంస్థ నిర్వహిస్తున్న వివిధ శిక్షణ కార్యక్రమాలు, భవిష్యత్తు కార్యాచరణపై ఆమె ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర వికాసం కోసం వినూత్నమైన ప్రణాళికలు రూపొందించాలని, అప్పుడే పల్లెల్లో నిజమైన మార్పు సాధ్యమవుతుందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో టీజీ ఐఆర్డీ సీఈఓ కె. నిఖిల సంస్థ యొక్క ప్రస్తుత కార్యకలాపాలను మంత్రికి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌లకు విజయవంతంగా శిక్షణ పూర్తి చేశామని, ప్రస్తుతం వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా జిల్లాల్లో జరుగుతున్న ఈ శిక్షణల ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయని పేర్కొన్నారు. సంస్థలో ఉన్న నిపుణుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, శిక్షణ మెటీరియల్‌ను మరింత సరళంగా, సామాన్యులకు అర్థమయ్యే రీతిలో రూపొందించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు స్థానిక సంస్థల నిధులు, విధులు మరియు హక్కులపై పూర్తిస్థాయి అవగాహన ఉండాలని మంత్రి నొక్కి చెప్పారు. ప్రజలు తమ బాధ్యతలను, హక్కులను గుర్తించినప్పుడే గ్రామాల్లో అభివృద్ధి పారదర్శకంగా జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో అమలవుతున్న చట్టాలపై అక్కడి స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలని సూచించారు. దీనివల్ల గిరిజన ప్రాంతాల్లో పాలన మరింత మెరుగుపడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. టీజీ ఐఆర్డీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి భరోసా ఇచ్చారు. సంస్థలో కొత్త ఆడిటోరియం నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూపొందించిన యాక్షన్ ప్లాన్ అమలులో ఎటువంటి జాప్యం జరగకుండా ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గ్రామీణ పాలనలో నాణ్యతను పెంచేలా శిక్షణా విధానాలు ఉండాలని, శిక్షణ పొందిన వారు క్షేత్రస్థాయిలో మార్పు తీసుకువచ్చేలా ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. నిధుల వినియోగంలో పారదర్శకత, ప్రాధాన్యత క్రమంలో పనుల ఎంపికపై ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇవ్వడం ద్వారా పల్లెలు స్వయం సమృద్ధి సాధిస్తాయని వివరించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, సంస్థ ప్రొఫెసర్లు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రి సమీక్షతో టీజీ ఐఆర్డీ కార్యకలాపాల్లో కొత్త వేగం పుంజుకోనుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ధనుష్ సినిమాలో సారా అర్జున్?



దక్షిణాది స్టార్ హీరో ధనుష్ తన కెరీర్‌లో వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతూ మరో కొత్త ప్రాజెక్ట్‌తో వార్తల్లో నిలిచారు. నటుడిగా మాత్రమే కాకుండా దర్శకుడిగానూ రాణిస్తున్న ఆయన, ప్రస్తుతం పలు క్రేజీ ప్రాజెక్టులను పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఇప్పటికే ఆయన ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న కర సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రాన్ని ఈ నెలాఖరులోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. యాక్షన్, ఎమోషన్ కలగలిపిన కథతో ఈ సినిమా ఉండబోతుందనే సమాచారం సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఇదిలా ఉండగా, దర్శకుడు తమిళరాసన్ పచ్చముత్తు దర్శకత్వంలో రూపొందనున్న మరో కొత్త చిత్రానికి ధనుష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సినిమా కాస్టింగ్ విషయంలో ఇటీవల ఆసక్తికరమైన మార్పులు చోటుచేసుకున్నాయి. మొదట ఈ చిత్రంలో కథానాయికగా ఎంపికైన రుక్మిణీ వసంత్ ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండటంతో ఈ సినిమాకు డేట్స్ కేటాయించలేక తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఆమె స్థానంలో ఇప్పుడు బాలనటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న సారా అర్జున్ పేరు ముందుకు వచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 'ధురంధర్' సినిమాతో మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన సారా, ఈసారి హీరోయిన్‌గా ధనుష్ సరసన నటించే అవకాశముందనే టాక్ వినిపిస్తోంది.ఇప్పటికీ ఈ విషయంపై అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, ఈ క్రేజీ కాంబినేషన్‌పై అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది.

# వరుణ్ తేజ్‌కు గాయం.. షూటింగ్‌కు బ్రేక్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ గాయపడిన ఘటన అభిమానుల్లో ఆందోళన కలిగించింది. ప్రస్తుతం ఆయన నటిస్తున్న బరి సినిమా కోసం ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం, ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తుండగా వరుణ్ తేజ్ కాలికి గాయం అయింది. వెంటనే చిత్ర యూనిట్ అప్రమత్తమై ఆయనను ఆసుపత్రికి తరలించింది. వైద్యులు పరీక్షించి చిన్నపాటి శస్త్రచికిత్స అవసరమని సూచించగా, వెంటనే సర్జరీ నిర్వహించారు. ఆ ఆపరేషన్ విజయవంతంగా పూర్తైనట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం వరుణ్ తేజ్ ఆసుపత్రిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉన్నప్పటికీ, పూర్తిగా కోలుకోవడానికి కొన్ని వారాల పాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. దీంతో 'బరి' సినిమా షూటింగ్‌కు తాత్కాలికంగా విరామం ఇచ్చారు. ఆయన పూర్తిగా కోలుకున్న తర్వాతే తిరిగి షూటింగ్ ప్రారంభం కానుంది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని దర్శకుడు యదు వంశీ రూపొందిస్తున్నారు. యాక్షన్‌తో కూడిన ఈ హైవోల్టేజ్ డ్రామాలో వరుణ్ తేజ్ కొత్త లుక్‌లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాను 2027 సంక్రాంతి సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, వరుణ్ తేజ్ గాయంపై సోషల్ మీడియాలో అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా కోలుకోవాలని శుభాకాంక్షలు తెలియజేస్తూ "గెట్ వెల్ సూన్" పోస్టులు పెడుతున్నారు.



# చీరలో తారల అందాల సందడి

కేరళ రాష్ట్రంలో అత్యంత ముఖ్యమైన పండుగగా భావించే విషు సందర్భంగా దక్షిణ భారత సినీ తారలు సామాజిక మాధ్యమాల్లో విశేషంగా సందడి చేశారు. ఈ పండుగను పురస్కరించుకుని పలువురు ప్రముఖ నటీమణులు తమ అభిమానులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రత్యేకంగా చిత్రాలను పంచుకున్నారు. అందులో ముఖ్యంగా కేరళకు చెందిన ప్రముఖ నటీమణులు ప్రియమణి, సంయుక్త, రమ్య నంబీశన్ పంచుకున్న చిత్రాలు నెట్టింట వైరల్‌గా మారాయి. చీరకట్టులో సంప్రదాయ వేషధారణలో మెరిసిపోయిన ఈ తారలు తమ అందాలతో అభిమానులను ముగ్ధుల్ని చేస్తున్నారు. పసుపు, తెలుపు రంగుల చీరల్లో కనిపించిన వారు కేరళ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలంకరణలో సరళతను పాటిస్తూ, సంప్రదాయ ఆభరణాలతో మెరిసిన ఈ తారల రూపం నెటిజన్లను ఆకట్టుకుంటోంది.

పండుగకు సంబంధించిన భావాలను ప్రతిబింబించేలా ఈ చిత్రాలను పంచుకున్న తారలు, తమ సందేశాల్లో ఆనందం, శాంతి, సంతోషం నిండాలని ఆకాంక్షించారు. అభిమానులు కూడా పెద్ద సంఖ్యలో స్పందిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ముఖ్యంగా ప్రియమణి, సంయుక్తల సొగసైన చీరకట్టు, సహజమైన చిరునవ్వు నెటిజన్లను మరింతగా ఆకర్షిస్తోంది. ఇటీవల కాలంలో సామాజిక మాధ్యమాలు తారలు మరియు అభిమానుల మధ్య అనుసంధానంగా మారుతున్న నేపథ్యంలో, ఇలాంటి పండుగ సందర్భాల్లో తారలు పంచుకునే చిత్రాలు మరింత ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో విషు పండుగ సందర్భంగా పంచుకున్న ఈ అందమైన చిత్రాలు ప్రస్తుతం నెట్టింట విస్తృతంగా చర్చనీయాంశంగా మారాయి.



# అనన్య నాగళ్ల హాట్ ఫోజులు

తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన అనన్య నాగళ్ల ఒక ప్రముఖ తెలుగు సినీ నటి. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగాన్ని వదిలి, చిన్న చిన్న చిత్రాల ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఆమె, 'మల్లేశం' చిత్రంతో కథానాయికగా మంచి గుర్తింపు పొందింది. అనంతరం 'వకీల్ సాబ్', 'పొట్టేల్' వంటి చిత్రాలలో నటిస్తూ గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలతో తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఇప్పటివరకు పలు చిత్రాలలో పల్లెటూరి అమ్మాయి పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ అందాల తార, ప్రస్తుతం తన శైలి మార్చి గ్లామర్ మోతాదును పెంచుతోంది. ఇటీవల ఆమె తన సామాజిక మాధ్యమ వేదికలో పంచుకున్న ఆకర్షణీయ చిత్రాలు విస్తృతంగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ఈ చిత్రాలను చూసి అభిమానులు ముగ్ధులవుతుండగా, యువతలో మంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం అనన్య నాగళ్ల తాజా అందాల ప్రదర్శన నెట్టింట చర్చనీయాంశంగా మారింది.



# 'వారణాసి'కి రాజమౌళి ప్లాన్

సూపర్‌స్టార్ మహేష్ బాబు, దర్శక ధీరుడు ఎస్. ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న వారణాసి సినిమాపై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి సంబంధించిన ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా షూటింగ్ కోసం గతంలో దేవర చిత్రానికి ఉపయోగించిన ప్రత్యేక వాటర్ సెట్స్‌ను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. 'దేవర'లో సముద్రపు సన్నివేశాల కోసం హైదరాబాద్‌లోని శంషాబాద్ సమీపంలో భారీ వాటర్ ట్యాంక్‌తో పాటు బ్లూ మ్యాట్ టెక్నాలజీతో ప్రత్యేకంగా సెట్ నిర్మించారు. ఇప్పుడు అదే సెట్‌ను 'వారణాసి' కోసం గంగా నది నేపథ్య సన్నివేశాలకు అనుగుణంగా మార్పులు చేసి ఉపయోగిస్తున్నట్లు సమాచారం.

మూలంగా ఈ షెడ్యూల్ విదేశాల్లో చిత్రీకరించాలని ప్లాన్ చేసినప్పటికీ, ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ ప్రయాణాలను రిస్క్‌గా భావించిన రాజమౌళి తెలివిగా ప్లాన్ మార్చినట్లు తెలుస్తోంది. దీంతో హైదరాబాద్‌లోనే భారీ స్థాయిలో షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఈ సెట్స్‌లో మహేష్ బాబుపై రివర్ ఛేజ్ సన్నివేశాలు, హైటెక్ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. 'దేవర'లో ఉపయోగించిన అడ్వాన్స్‌డ్ సినిమాటోగ్రఫీ టెక్నిక్స్, వాటర్ షూట్ అనుభవాన్ని ఈ చిత్రానికి కూడా వినియోగిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ విషయాలపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ, రాజమౌళి మాస్టర్ ప్లాన్‌తో 'వారణాసి' మరింత గ్రాండ్ విజువల్ అనుభూతిని అందించనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in